www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 24 ఆగస్టు 2024

5

సైన్స్ పట్ల విద్యార్థులకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - వేంపల్లె

సైన్స్ పట్ల ప్రతి విద్యార్థి అవగాహన కల్గి ఉండాలని బాలుర పాఠశాల హెచ్ఎం శివ మునెమ్మ తెలిపారు. శుక్రవారం తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా వేంపల్లెలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలి అంతరిక్ష దినోత్సవం సందర్భంగా చిత్ర లేఖనం పోటీలు చేపట్టడం సంతోషకరమని చెప్పారు. సైన్సు ద్వారా పలు విషయాలను తెలుసుకొనేందుకు అవకాశం ఉందని చెప్పారు. చిత్ర లేఖనంలో ప్రతిభ చూపిన ధనుంజయ, భరత్, హమీద్, మనోహర్, భువనేశ్వర్, రామ్ చరణ్, మహమ్మద్, ఫజీల్, ఖాన్ లను అభినందించారు. కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీల బలోపేతానికి కృషి

భూ కబ్జాలకు పాల్పడితే గూండా చట్టం

రాయలసీమ కోసం కూలీగా పనిచేస్తా

ఆడబిడ్డల సంరక్షణ రాష్ట్రంగా తీర్చిదిద్దుతా

మైసూరివారిపల్లి గ్రామసభలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

మైసూరివారిపల్లి గ్రామసభలో ప్రసంగిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-కడపప్రతినిధి/రైల్వేకోడూరు/రాజంపేట అర్బన్

రాష్ట్రంలోని పంచాయతీలను బలోపేతం చేస్తామని, స్వర్ణ పంచాయతీలు, డిజిటల్ భారత్ వైపు అడుగులు వేయిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. శుక్రవారం రైల్వే కోడూరు, రాజంపేట నియోజకవర్గాల పరిధిలోని మైసూరివారిపల్లి గ్రావసభ, అన్నమయ్య డ్యామ్ ముంపు గ్రామమైన పులపుత్తూరుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచా యతీల అభ్యున్నతి కోసం నిలబడేవాళ్లు దేశాన్ని కదిలించే నాయకులు అవుతారని చెప్పారు. దేశం అభివృద్ధి చెందాలంటే గ్రామాలను అభివృద్ధి చేయా లని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్య మైపోయిన సమయంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సగర్వంగా గ్రామసభలను నిర్వహి ంచుకుం టున్నామని తెలిపారు. గతంలో గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తే కూటమి ప్రభుత్వంలో నిధులు ఇచ్చి బలోపేతం చేస్తున్నా మని పేర్కొన్నారు. గ్రామాలలో దేశభక్తిని పెంపొం దించడానికి స్వాతంత్ర్య దినోత్సవాన్ని గొప్పగా జరపడానికి రూ.100, రూ.200 ఉన్న నిధులను రూ.10 వేలు, రూ.25 వేలకు పెంచామని తెలిపారు. నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే రైల్వేకోడూరు ప్రాంతమే కాకుండా రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఒక మహిళ ద్వారా తెలుసుకున్నానని, ఆమెను అభినందించారు. గ్రామాల జనాభాలో సుమారు 50 శాతం పైగా మహిళలు ఉంటారని, అన్ని గ్రామ సచివాలయాలలో మహిళలందరూ వెళ్లి తమ సమస్యలను తెలుపుకునేలా వాటిని రూపొందిస్తామని తెలిపారు. యువత నుంచి తాను కోరుకునేది ఒకటేనని అదే సామాజిక బాధ్యతని యువతకు సందేశం ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు బలోపేతం అవుతాయని తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామాలను నిర్వీర్యం చేశారని తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రైల్వేకోడూరును ఆంధ్రప్రదేశ్ ఉద్యానవన రాజధానిగా పిలుస్తారని, ఈ ప్రాంతంలో ఉద్యానవన పంటలు అధికంగా పండుతాయని తెలిపారు. ఎపిఎండిసిలో రైల్వేకోడూరు స్థానిక యువతకు ఎక్కువ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకో వాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. మైసూ రువారిపల్లి గ్రామసభను స్ఫూర్తిగా తీసుకొని రైల్వేకో డూరులోని అన్ని గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలలో నాలుగు ఇతివృత్తాలను తీసుకొని రాబోయే నాలుగేళ్లలో సుస్థిర పంచాయతీలుగా మార్చాలని మంచి ఉద్దేశంతో గ్రామసభలను నిర్వహించుకుంటున్నామన్నారు. గ్రామసభల ద్వారా పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన స్ఫూర్తితో జిల్లాను ముందుకు తీసుకెళ్లడానికి అన్ని విధాల కృషి చేస్తామని తెలిపారు. మైసూరువారిపల్లి సర్పంచ్ సంయుక్త మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తమ గ్రామానికి రావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులు తమ గ్రామ పంచాయతీకి అందాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు రావడం సంతోష దాయకమని పేర్కొన్నారు. మైసూరువారిపల్లిలో చేపట్టిన సిసి రోడ్లు, కోల్డ్ స్టోరేజ్, ఎన్ఆర్ఇజిఎ, రక్షణ గోడ నిర్మాణం, ఉద్యానవన పంటలకు బీమా తదితర పనుల గురించి ఆమె వివరించారు. కలెక్టర్ తమ గ్రామానికి రూ.10 లక్షల నిధులను ప్రత్యేకంగా కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలి పారు. అనంతరం తమ గ్రామానికి సంబంధించిన వివిధ సమస్యలైన రోడ్లు, యువతకు ఉపాధి, పాఠశాలలో ఆటస్థలం కేటాయింపు, తదితర అంశాలను ఉప ముఖ్యమంత్రికి విన్నవించారు. అనంతరం మైసూరువారిపల్లి పంచాయతీ కార్యదర్శి మహేష్ గ్రామానికి సంబంధించిన వివిధ పనులను తెలుపుతూ గ్రామసభ యొక్క అంగీకారాన్ని కోరగా పనులన్నింటికీ గ్రామసభ అంగీకారం తెలిపింది. సమావేశంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ముక్కా సాయి వికాస్‌రెడ్డి, జనసేన నాయకులు, డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్, తాతంశెట్టి నాగేంద్ర, యనమల భాస్కరరావు, పగడాల చంద్రశేఖర్, పగడాల వెంకటేష్, నాగరాజ, జోగినేని మణి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు జెసి ఆదర్శ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి, డ్వామా పీడీ మద్దిలేటి పాల్గొన్నారు.

పులపత్తూరులో ఫొటో గ్యాలరీని తిలకిస్తున్న పవన్

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

అన్నమయ్య ప్రాజెక్టు బాధితులు అధైర్య పడొద్దని, అండగా ఉంటామని పవన్ కల్యాణ్ అన్నారు. పులపుత్తూరు గ్రామంలో పర్యటించి అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితుల కన్నీటి గాధను ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన ఫొటో గ్యాలరీని అధికారులు ఏర్పాటు చేయడంతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్న మయ్య ప్రాజెక్ట్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన బాధితులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఆ దిశగా ఆదు కోవడంలో పూర్తిగా విఫలమయ్యారని విమ ర్శించారు. 300 ఇళ్ల నిర్మాణానికి రూ.6 కోట్ల బిల్లులు సత్వరమే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఐదు సెంట్లు భూమి కోల్పోయి కేవలం 1.5 సెంట్లు పరిహారం పొందిన వారికి 5 సెంట్లు ఇస్తామన్నారు. భవిష్యత్తులో వరద నష్టం జరగకుండా ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకు ంటా మన్నారు. రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంటరీ అధ్యక్షులు ఎల్లటూరు శ్రీనివాసరాజు, నియోజకవర్గ సమన్వయకర్త అతికారి దినేష్, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వీ రమణ పాల్గొన్నారు.

స్థలదాత నారాయణను అభినందిస్తున్న పవన్

ఆదర్శప్రాయుడు 'టంగుటూరి'

- కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయుడని ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసు కోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపు హాలులో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సమాజం కోసం అంకిత భావంతో పనిచేశారని అన్నారు. ఆయన భారత దేశానికి చెందిన న్యాయవాదని, వలసవాద వ్యతిరేక జాతీయవాది, రాజకీయ నాయకుడు, సంఘ సంస్కర్త అని అన్నారు. బ్రిటిష్ పాలనలో ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీకి ముఖ్యమంత్రిగా కూడా ఉన్నారని, ఆంధ్ర రాష్ట్రం మద్రాస్ నుంచి విడిపోయాక ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా ఉన్నారన్నారు. 1922వ సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమ సమయంలో గుంటూరులో 30 వేల మంది కాంగ్రెస్ వాలంటీర్లతో ప్రదర్శనలు నిర్వహించారన్నారు. సైమన్ కమిషన్ ఇండియాలో సందర్శించినప్పుడు ప్రజలు 'Simon Go Back' అనే నినాదంతో బహిష్కరించారని చెప్పారు. ప్రకాశం అధ్యక్షత వహిస్తున్న ప్రజలు మద్రాస్ హైకోర్టు వద్ద ఎక్కువ సంఖ్యలో గుమికూడటంతో పోలీసులు కాల్పులు జరిపారని, జనాలను చెల్లా చెదురు చేయటానికి జరిపిన పోలీసుల కాల్పులలో పార్థ సారథి అనే యువకుడు అక్కడికక్కడే మరణించడం, ఆ మృతదేహానికి ఎవరైనా దగ్గరికొస్తే కాలుస్తామని హెచ్చరించగా ప్రకాశం పంతులు కోపంతో తన రొమ్మును చూపించి ధైర్యముంటే కాల్చమని సవాలు చేశారని గుర్తు చేశారు. ప్రకాశం చూపించిన ధైర్య సాహసాలకు ఆంధ్ర కేసరి అని బిరుదు ఇచ్చారన్నారు తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఎఫ్ఒ సందీప్ రెడ్డి, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. సంఘసంస్కర్త రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటైన ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు సేవలందించారని, ఆయన సేవలను ఎప్పటికీ మరువలేమని సీనియర్ వైద్యులు డాక్టర్ గోపీనాథ్ అన్నారు. రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం జయంతి కార్యక్రమం నిర్వహించారు కార్యక్ర మంలో ఆర్‌కె సేవాసమితి అధినేత అబ్దుల్ రాయల్ షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెసి, ఎస్‌పి

బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రకాశం పంతులు : ఎస్‌పి

కడప అర్బన్ : ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని కడప జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్ర పటానికి ఎస్‌పి హర్షవర్ధన్ రాజు పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో సైమన్ కమీషను వారికి ఎదురు నిలిచిన ధైర్యశాలి టంగుటూరి ప్రకాశం పంతులు లని, అప్పటి నుంచి ప్రజలంతా ఆయన్ని 'ఆంధ్ర కేసరి'గా కీర్తించారన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి జి.వెంకట రాముడు, ఎఆర్ అదనపు ఎస్.పి ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఎఆర్ డిఎస్‌పి మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైల రెడ్డి, టైటస్, ఆర్ఎస్ఐలు, పోలీస్, డిపిఒ, సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు నీతికి, నిజాయితీకి, నిర్భీతికి, నిరాడంబరతకు, ధైర్య సాహసాలకు మారుపేరని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో టంగుటూరి ప్రకాశం పంతులు 152 వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోనూ ప్రకాశం పంతులు చిత్ర పటానికి హెచ్ఎం శివ మునెమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, వేమారాజా, బాలసుబ్బరాయుడు, వినయ్, ఉపాధ్యాయులు ధర్మారెడ్డి, శ్రీనివాసులు, బాస్కర్ రెడ్డి, పిఇటి రాజశేఖర్ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సన్నీ' సేవలు అభినందనీయం

- ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

పోలీస్ జాగిలం 'సన్నీ' 11 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించి, పలు కీలక విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం అభినందనీయమని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీస్ హాలులో 'సన్నీ' ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించడంలో నేర్పరిగా పేరున్న లాబ్రడార్ జాతికి చెందిన జాగిలం 'సన్నీ'ని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సుదీర్ఘ కాలంపాటు పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ తరువాత సంపూర్ణ ఆరోగ్య తో, చురుగ్గా ఉండేలా కంటికి రెప్పలా చూసుకున్న హ్యాండ్లర్ ఎన్.వి.సుధీర్ రాజా (ఏ.ఆర్ పి.సి 2275)ను ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. ముమ్ముందు కూడా జాగ్రత్తగా చూసుకోవాలని ఆకాంక్షించారు. జాగిలాలతో అనుబంధం భావోద్వేగాలతో కూడుకుని ఉంటుందని తెలిపారు. పెంపుడు జాగిలంతో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పలు సిఎం బందోబస్తు విధులు, వివిఐపి, విఐపి ల విధులు, కృష్ణా, గోదావరి పుష్కరాలలో, తిరుమల బ్రహ్మోత్సవాలలో సమర్ధంగా విధులు నిర్వహించి పలువురి ప్రశంసలు పొందడం అభినందనీయమన్నారు. అసెంబ్లీ బందోబస్తు విధులు, స్వాతంత్ర్య, రిపబ్లిక్ వేడుకల సందర్భంగా పెరేడ్ నందు ప్రదర్శన చేసి ప్రతిభ కనబరిచిందని చెప్పారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో బందోబస్తు విధుల్లో, కౌంటింగ్ సెంటర్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమర్ధవంతంగా విధులు నిర్వహించిందని తెలిపారు. ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్.ఎస్.వి కృష్ణారావు మాట్లాడుతూ 2012, డిసెంబర్ 26లో జన్మించిన 'సన్నీ' ఏడాది పాటు శిక్షణ పొందిన అనంతరం 2013, నవంబర్ 30న జిల్లా పోలీస్ శాఖలో సేవలను ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి జి.వెంకట రాముడు, ఎఆర్‌డిఎస్‌పి మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, టైటస్, శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్ఐలు స్వామి నాయక్, వెంకటేశ్వర్లు, అప్పలనాయుడు, పావని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు జాగిలం సన్నీ ఉద్యోగ విరమణ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎస్‌పి

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండించాలి

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్ : కలకత్తా ఆర్‌జి కర్ జూనియర్ డాక్టర్‌పై చోటు చేసు కున్న అత్యారం, హత్యను నిరసిస్తూ ఎస్ ఎఫ్ఐ రాష్ట్ర నిరసనలు పిలుపులో భాగంగా జమ్మలమడుగులో శుక్రవారం స్థానిక ఎస్‌పి జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భగా ఎస్ఎఫ్ఐ జమ్మలమడుగు పట్టణ నాయకులు హుస్సేన్ మియా మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ ఫై అత్యాచారానికి సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశ్రారు. మహిళపై అత్యాచారాలు చట్టాలు కఠిన తరం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు హరిబాబు, విష్ణు ,చంద్రశేఖర్ ఫ్యామిలీ షరీఫ్ రఫీ ఇమామ్ నూరు పాల్గొన్నారు. **అట్లూరు :** జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య చాలా నీచమైన ధర్మార్గమైన చర్యని వడ్డెర వృత్తి దారుల సంఘం మండల నాయకులు బత్తల గంగయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో వడ్డెర వృత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యా చారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని పేర్కొన్నారు. ఘటనలో బాధులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . సమావేశంలో బి. గంగయ్య, సి రామలక్ష్మి, వి లక్ష్మీదేవి, సి లక్ష్మీదేవి, వి సుధ పాల్గొన్నారు.

చెట్లే మానవ మనుగడకు ప్రాణవాయువు

ప్రజాశక్తి - బద్వేలు : వృక్షాలను నాటి సంరక్షిస్తే అవి జీవులకు ప్రాణవాయువును ఇచ్చి కాపాడతాయని బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బంగారు గురుమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఆకులు, బెరడు, విత్తనాలు, పుల్లలతో సహా ఎన్నెన్నో ఉపయోగాలను చేకూరుస్తున్న చెట్టు కానుగ చెట్టని, బద్వేల్ పట్టణంలో 10 వేల చెట్లను నాటే కార్యక్రమాన్ని ఎంచుకున్న బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ అసోసియేట్ అధ్యక్షులు పెద్దిరెడ్డి సతీష్ రెడ్డి అభినందనీయులని చెప్పారు. పట్టణంలో సిద్ధవటం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఆర్‌డిఒ కార్యాలయం నుంచి బయనపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా 120 గుంతలను తీశామని చెప్పారు. శనివారం ముఖ్య అతిథులు ఆర్‌డిఒ, తహశీల్దార్, ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్ అర్బన్, రూరల్ సిఐలు, ఫారెస్ట్‌రేంజి అధికారి పాల్గొని మొక్కలు నాటుతాయని చెప్పారు. పుర ప్రజలందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

'గండి' ఇఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-చక్రాయపేట : గండి క్షేత్రం అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న జె.వెంకట సుబ్బయ్య నేనే రాజు నేనే మంత్రి అను చందంగా వ్యవహరిస్తున్నారని ఆయ నపై చర్యలు తీసుకోవాలని దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణ తేజ డిమాండ్ చేశారు. శుక్రవారం గండి క్షేత్రంలో బోర్డు మెంబర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఒ బాధ్యతలు చేపట్టింది మొదలుకొని ఇప్పటి వరకు గండి దేవస్థాన బోర్డు సభ్యులతో సమావేశం నిర్వహించకుండా తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గండి క్షేత్రానికి వచ్చే భక్తుల ఏర్పాట్లపై కమిటీ ఏర్పాటు చేస్తామని చైర్మన్ చెప్పినప్పటికీ ఏమాత్రం పట్టించుకోలేదన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం : జడ్జి

ప్రజాశక్తి-కడప : ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరం బాలాజీనగర్‌లో గల శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ర్యాగింగ్‌లో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను అవమానించడం, వేధించడం వంటివి ఉంటాయని అన్నారు. ఇలాంటి మానసిక హింసకు దారితీసి ప్రాణాంతకమవుతాయని తెలిపారు. లైంగిక వేధింపులు, స్వలింగ సంపర్క దాడులు, బట్టలు విప్పడం, అశ్లీల చర్యలు, సంజ్ఞలు, శారీరక హాని లేదా ఆరోగ్యానికి లేదా వ్యక్తికి ఏదైనా ఇతర ప్రమాదాన్ని కలిగించే అన్ని రకాల శారీరక వేధింపుల చర్యను ర్యాగింగ్ విభాగంలో క్రిమినల్ కొలతలతో చేర్చవచ్చని పేర్కొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే పడే శిక్షలు సెక్షన్లతో జడ్జి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి,విద్యార్థులు పాల్గొన్నారు.

నగరాన్ని శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరాన్ని శుభ్రంగా ఉంచాలని కార్పొరేషన్ అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం అన్నారు. శుక్రవారం మార్నింగ్ విసిట్లో భాగంగా రవీంద్ర నగర్, కాగితాల పెంట, ఐటిఐ సర్కిల్, ఎస్టేట్ ప్రాంతాలను సంబంధిత శానిటేషన్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా కాగితాల పెంట ప్రాంతం పరిశీలిస్తూ అక్కడ ఉన్నటువంటి పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ విధుల్లో ఎటువంటి జాప్యం ఉండరాదని పేర్కొన్నారు. కేటాయించిన పనులలో నిర్లక్ష్య వైఖరి లేకుండా నగరాన్ని శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. అనంతరం ఐటిఐ సర్కిల్ వద్ద ఉన్న క్లబ్ వాహన డ్రైవరు, లోడర్ వారితో మాట్లాడుతూ వారికి కేటాయించినటువంటి ఇళ్ల ముందు 100 శాతం చెత్త స్వీకరణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు చెత్తను తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా ఇచ్చేలా అవగాహన కల్పిస్తూ చెత్తను స్వీకరించాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలో ఉన్న పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలిస్తూ వారు ఉన్న చోట స్వయంగా తనిఖీ చేశారు. ఎక్కడైనా చెత్త పాయింట్లను శుభ్రం చేయకపోతే తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజు, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో సిబ్బంది సరిగ్గా పని చేయలేదని, రోగులకు అందుబాటులో లేకుండా వైద్యులు, నర్సులు మధ్యాహ్నం ఐతే చాలు ఎవరు ఉండరన్నారని పేర్కొన్నారు. వార్డు, ఎంఎస్-వార్డులో సిబ్బంది లేరని ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేస్తే సూపరింటెండెంట్ స్పందించడం లేదని వాపోయారు. రక్త నిధి కేంద్రం సిబ్బంది నిర్లక్ష్య ధోరణి విడనాడాలన్నారు. జిల్లా అధికారులు స్పందించి ప్రజలకు రోగులకు సరైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

ఉర్దూ జూనియర్ కళాశాలను అభివృద్ధిచేయాలి

కలెక్టర్‌ను సన్మానిస్తున్న కార్మిక నేస్తం సభ్యులు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులో ఉన్న జూనియర్ కళాశాలను అభివృద్ధి చేయాలని కార్మిక నేస్తం జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కడపలో కలెక్టర్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్‌ను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్న ప్రొద్దుటూరులో ఉర్దూ కళాశాల ఆవశ్యకత ఎంతో ఉన్నందున అతికష్టంపైన ఈ కళాశాలను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. దీంతో ప్రొద్దుటూరుతో పాటు చుట్టుపక్క ప్రాంతాలైన యర్రగుంట్ల, మైదుకూరు, చాపాడు, జమ్మలమడుగు తదితర ప్రాంతాల పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. అయినప్పటిక కళాశాల నిండా సమస్యలు పేరుకుపోవడంతో ఇక్కడి విద్యార్థులకు చాలా అసౌకర్యంగా ఉందని వాపోయారు. సరిపడినన్ని తరగతి గదులు లేవన్నారు. ఇరుకుగా విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. . ల్యాబ్ రూములు లేవన్నారు. మరుగుదొడ్ల సమస్య ప్రధానంగా పీడిస్తోందన్నారు. బాటనీ, ఫిజిక్స్ అధ్యాపకులు కొరత ఉందన్నారు. స్పందించిన కలెక్టర్ త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిలర్ గాజుల శివజ్యోతి, వడ్ల ఇబ్రహీం, మాహినూర్, మైనార్టీ నాయకులు, బాబా, నూరి, ఎస్యం హర్షద్, ఫిట్టర్ రఫీ, పాలగిరి బాబా, మస్తాన్, ముస్లిం ఐక్య వేదిక గౌరవ అధ్యక్షులు ఖాజా మైనుద్దీన్ పాల్గొన్నారు.

'గుళ్లపల్లి'కి స్వర్ణ పతకం

ప్రజాశక్తి - కడప అర్బన్ :

ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఆప్థల్మాలజీ 2024 సంవత్సర ఐసిఒ జూల్స్ ఫ్రాన్సువా స్వర్ణ పతకం ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్వీపీఈఐ) వ్యవస్థాపకులు డాక్టర్ గుళ్ళపల్లి ఎన్ రావుకు లభించింది. శుక్రవారం కడప ఎల్‌విపిఇఐలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వైద్యులు మాట్లాడుతూ ఈ పురస్కారంతో సత్కరించబడిన మొదటి భారతీయుడు, ప్రపంచవ్యాప్తంగా 11వ గ్రహీతగా ఆయన గుర్తింపు పొందారన్నారు. ఈ మేరకు కెనడా వాంకూవర్‌లో జరిగిన ప్రపంచ ఆప్థల్మాలజీ కాంగ్రెస్ 2024 (డబల్యూవోసి2024)లో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారన్నారు. ఐసివో జూల్స్ ఫ్రాన్సువా స్వర్ణ పతకం 4 సంవత్సరాలకొకసారి 'అత్యున్నత వైజ్ఞానిక నాణ్యతగల నేత్ర సంబంధిత కృషి'కి ఇస్తారన్నారు.

గ్రామసభలో ఎస్ఐతో వాగ్వాదం

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని వరికుంట్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఎస్ఐ హనుమంతుతో అదే గ్రామానికి చెందిన దేవసాని గోవిందరెడ్డి, ఆయన తండ్రి సత్యనారాయణరెడ్డి వాగ్వాదానికి దిగారు. అంగన్వాడీ టీచర్ వినోదాదేవి పాఠశాల వద్ద ఉన్న కంకరు తొలగించాలని గ్రామసభలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై చర్చ జరుగుతుండగా గోవిందరెడ్డిని ఎస్ఐ పిలిచి కంకర తొలగించాలని చెప్పారు. ఇందుకు ఆగ్రహించిన గోవిందరెడ్డి ఎస్ఐని దుర్భాషలాడుతూ వాగ్వాదానికి దిగాడు. దీంతో గ్రామసభలో ప్రజలకు ఇబ్బంది పడ్డారు. అనంతరం అక్కడున్న పెద్దలు సర్దిజెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - కడప

కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న నారాయణ స్కూల్‌లో శుక్రవారం కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకొని ముందస్తు వేడుకలను ప్రిన్సిపల్ గీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థులు శ్రీకృష్ణ గోపికల వేషధారణతో అలరించారు. అనంతరం ప్రిన్సిపల్ గీతా మాట్లాడుతూ ఎజిఎం శ్రీనివాసులు, ఆర్ఐ కిరణ్ కుమార్ల ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించామన్నారు. ఒక్క నారాయణ విద్యాసంస్థల్లోనే ఇలాంటి పండుగలు నిర్వహించి పిల్లల్లో ఉత్సాహం నింపుతున్నామన్నారు. అలాగే స్కూల్ టీచర్లకు విద్యార్థుల తల్లిదండ్రులకు నారాయణ స్కూల్ యాజమాన్యం తరపున ముందస్తు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు

వైద్యులకు, సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ

గర్భిణుల పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆరోగ్య, వైద్య సిబ్బంది గర్భిణుల పట్ల జాగ్రత్త వహించాలని జమ్మలమడుగు డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆమె స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను, కాన్పుల గది, స్కానింగ్ పరికరాలను, పరిసరాలను పరిశీలించి తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజు ఆసుపత్రిని శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్యకేంద్రాన్ని జమ్మలమడుగు డివిజన్లో మొదటి స్థానంలో ఉండే విధంగా చూడాలని వైద్యాధికారి కరిష్మాను సూచించారు. గర్భిణుల రిజిస్ట్రేషన్లు వంద శాతం ఉండాలన్నారు. దీని పైనే అన్ని సూచికలు ఆధార పడి ఉంటా యన్నారు. సచివాలయాల వైద్య సిబ్బంది గర్భిణీల పట్ల తగు జాగ్రత్తలు పాటించి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. అనంతరం ముద్దనూరు -1 ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహిస్తున్న డ్రై డే, డ్రై డే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. రోళ్ళు, తొట్లు, నీటి డబ్బాలు, డ్రెయినేజీలను శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. ఎస్ఎంఒలు, ఎమ్ఎల్ హెచ్ పిలు, ఆశా కార్యకర్తలు ఆరోగ్య విద్య ద్వారా దోమల లార్వా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజల ఆరోగ్యానికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్ వైజర్ శోభాకుమారి, స్టాఫ్ నర్స్ స్లేఫీ, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మసిస్ట్ జగదీష్, ఎఫ్ఎన్ఒ రిషిక, సిబ్బంది పాల్గొన్నారు.

సిఐ ఆర్.మోహన్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

సిఐ మోహన్‌కు సన్మానం

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇటీవల ఆర్.మోహన్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు శుక్రవారం ఆయను పోలీస్ స్టేషన్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ శ్రీరాములు యాదవ్, టిడిపి మండల సీనియర్ నాయకులు సంగాల నాగిశెట్టి రెడ్డి, సుంకేసుల డీలర్ ఎ.వి.ఎస్. మోహన్ రెడ్డి, విద్యుత్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ యేసు పాదం, భోయాజు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలనే వాడాలి

ప్రజాశక్తి-చెన్నూరు : మట్టితో చేసిన వినాయక ప్రతిమలనే పూజించాలని ఆంధ్రప్రదేశ్ పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆ శాఖ వారు పాట, మాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ శ్రీనివాసులు, ఎఇ అనిల్‌కుమార్‌రెడ్డి, కళాజాతా బృందం సభ్యులు మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

మైదుకూరు : విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సిడిపిఒ శ్రీదేవి

కెజిబివి విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - మైదుకూరు

స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు శుక్రవారం బహుమతులను పంపిణీ చేశారు. ఈ కేంద్రం 14న విద్యార్థినిలకు 1098, 181 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్‌లపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పాఠశాలలో ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీదేవి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.. ఈ సందర్భంగా సిడిపిఒ విద్యార్థులకు చైల్డ్ హెల్ప్ లైన్ పైనా, బాల్య వివాహాలపైనా అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతూ ఉంటే అధికారుల దృష్టికి తీసుకొని రావాలని తెలిపారు. విద్యార్థులను కార్తీక, నిహారిక, శృతి వ్యాస రచన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో వారికి బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రశాంతి, మహిళా పోలీస్ సునంద, ప్రిన్సిపల్ విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఖాజీపేట :** స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాల విద్యార్థినులకు 78వ స్వాతంత్ర్య వేడుక సందర్భంగా వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం పాఠశాల ప్రత్యేక అధికారిణి భార్గవి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రశాంతి ఎనిమిదవ తరగతి, సుమ హేమలత ఎనిమిదో తరగతి ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. 9వ తరగతి విద్యార్థి కీర్తన 9 వ తరగతి తృతీయ బహుమతి గెల్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారిణి భార్గవి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోను ఉన్నతంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి శుక్రవారము డ్రై డే పాటించాలని సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య పేర్కొన్నారు. శుక్రవారం బిదినంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గురిజాల లో ఫ్రైడే - డ్రైడే సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వే లార్వా సర్వే నిర్వహించి, ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గునియా, బోదకాలు, మెదడు వాపు వంటి వ్యాధులు వస్తాయని, లార్వా నిర్మూలన కోసం ఫ్రైడే-డ్రైడే ని పాటించాలని ఆయన సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ సిఐగా రంగనాథబాబు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల అర్బన్‌సిఐగా శుక్రవారం జీవన్ రంగనాథ బాబు బాధ్యతలు చేపట్టారు. ఆయన అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె సిఐగా పనిచేస్తూ, సాధారణ బదిలీల భాగంగా పులివెందుల అర్బన్ సిఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా శుక్రవారం రంగనాథ బాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల అర్బన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాల కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రజల ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఇందుకు అర్బన్ ప్రజలు పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు : జెసి

పులివెందుల : మొక్క నాటి, నీరు పోస్తున్న జెసి అదితిసింగ్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గ్రామ సమస్యల పరిష్కారానికే గ్రామ సభ అని జెసి అదితి సింగ్ అన్నారు. శుక్రవారం తొండూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను గ్రామ సభల ద్వారా తెలుసుకోవాలని అధికారులను ఆదేశించిందన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి పంచా యతీలోని సమస్యలకు గుర్తించి ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కారం చేయాలని ఆదేశించారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ప్రజలకు తెలపాలని వారికి ఈ ఉపాధి పనులపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదిగేలా కార్యాచరణ చేపట్టాలని హితవు పలికారు. పంచాయతీ నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో గ్రామసభలను ఏర్పాటు చేశారన్నారు. గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటారు. అనంతరం మల్లెల గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న బిసి వసతి గృహాన్ని పరిశీలించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని గుత్తే దారులను , అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. హాస్టల్ ఇన్‌ఛార్జి అనితను వసతి గృహంలో విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తొండూరు మాజీ జడ్‌పిటిసి శివమోహన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : గత ప్రభుత్వంలో పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు మండల పరిధిలోని సోములవారిపల్లె పంచాయతీలోని రాముడి గుడి వద్ద శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిధులను వాడుకుని పంచాయతీలను నిర్వీర్యం చేసిందన్నారు. దుర్మార్గమైన జగన్ పరిపాలన పోయి తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే పంచాయతీలకు నిధులను కేటాయించి రాష్ట్రమంతా గ్రామ సభలను నిర్వహిస్తోందని చెప్పారు. పంచాయతీ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి పంచాయతీలోని సమస్యలకు గుర్తించి ఎప్పటికప్పుడూ త్వరితగతిన పరిష్కారం చేయాలని సూచించారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ప్రజలకు తెలపాలని చెప్పారు. పంచాయతీ నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ జుబేదా, పశువైద్యాధికారి డాక్టర్ పి. సరస్వతి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంతి, సెక్రటరీ హరినాథ్, వివిధ శాఖల ప్రభుత్వ అధకారులు, వెటర్నరీ ఎహెచ్ఎ తేజస్విని, టిడిపి నాయకులు, కార్యకర్తలు, సోములవారి పల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

కలసపాడు : మండలంలోని లింగారెడ్డి పల్లె గ్రామంలో పంచాయతీ సెక్రటరీ మహేష్, ఆధ్వర్యంలో స్పెషలాఫీసర్ శివశంకర్ రెడ్డి, అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో స్వర్ణ గ్రామపంచాయతీగా తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యంగా విద్యుత్, మరుగు దొడ్లు, కొళాయి కనెక్షన్, రక్షిత రక్షిత మంచినీరు కోసం పైప్ లైన్, ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్లు, ఎస్‌సి కాలనీలో శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ, డ్రెయినేజీ , సిసి రోడ్లు వంటి సమస్యలు పరిష్కరించాలని మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ సగిలి బాలుడు స్పెషల్ ఆఫీసర్‌కు వినతి పత్రాలను సమర్పించారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ, 2024-25 సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులలో భాగంగా 1118 మంది ఉపాధి కూలీలు పని చేసి సుమారు 14 వేల పని దినాలను పూర్తి చేశారన్నారు. లింగారెడ్డి పల్లె గ్రామపంచాయతీలో 639 జాబ్ కార్డులు, 1217 మంది కూలీలు ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లెం గురమ్మ, నారాయణ, పంచాయతీ సెక్రెటరీ మహేష్, ఎంపిటిసి రమేష్, విఆర్ఒ సుధాకర్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ రమీజ్ భాష, డి ఏ వెంకటరెడ్డి, సర్వేర్ సతీష్, సి హెచ్ ఓ, బి. శ్రీను, లైన్మెన్ లక్ష్మిరెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మేఘన, పెద్దలు ఓబుల్ రెడ్డి, రంగారెడ్డి, భద్రయ్య, రామాంజనేయ రెడ్డి, పీరావలి, ముదిరెడ్డిపల్లి, శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్, రామచంద్రయ్య, శ్రీరాములు, రమణయ్య, శేషయ్య, శంఖవరం రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె : మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో 2024-25 ఎడాదికి సంబంధించిన అభివృద్ధి పనులపై సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజలతో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులను ఆయా గ్రామాల సర్పంచులు సహకరించాలని కోరారు. 2024-25 కు సంబంధించి పంచాయతీ రాజ్ కింద 18 పనులకు గాను రూ. 1.44 కోట్ల రూపాయలతో పనులు చేపట్టేందుకు నివేదికలు పంపినట్లు గ్రామ సభ స్పెషల్ అధికారి శ్రీనివాసులు చెప్పారు. సిమెంట్ రోడ్లు, ప్రహరీ గోడలు, మెంటల్ రోడ్లు పనులు చేపట్టుతున్నట్లు చెప్పారు. ప్రజల అవసరాలను తీర్చడం కోసమే పనులు చేస్తున్నట్లు చెప్పారు. 126 పనులకు గాను దాదాపు 2కోట్లతో హార్టికల్చర్ కింద పనులు చేపట్టుతున్నట్లు ఉపాధి హామీ పథకం ఎపిఒ పార్వతి చెప్పారు. జాబ్ కార్డులు ఉన్న వారికి ఉపాధి హామీ పథకం కింద పనులను కల్పిస్తామని చెప్పారు. ఆర్ఒ ప్లాంట్ల నుండి తాగునీటిని ప్రజలకు సరఫరా చేసేందుకు 6 ఆటోలను కూడ మంజూరు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి మల్లికార్జున రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, టిడిపి, బిజెపి నాయకులు, అంగన్వాడీ, ఉపాధి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ముద్దనూరు : మండల అభివృద్ధి కోసం మండల వ్యాప్తంగా రూ. 5 కోట్ల70 లక్షల పనులకు అంచనా వేసి ఆమోదం తెలిపినట్లు ఎంపిడిఒ చంద్ర మౌలీశ్వర్, ఉపాధిహామీ ఎపిఒ గంగయ్య తెలిపారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ బోనం సరళ, ఎంపిటిసి లక్ష్మి కాంతమ్మ అధ్యక్షతన ఇఒపిఆర్‌డి వీరభద్రుడు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచుల అధ్యక్షతన అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ జిఎస్ నిధులు ద్వారా సిసి రోడ్లు, శ్మశాన వాటికలు, జడ్‌పి పాఠశాలల ప్రహరీ నిర్మాణాలకు రూ. 5కోట్ల70లక్షలు అంచనా వేసినట్లు పిఆర్ ఎఇ వినయ్ కుమార్ తెలిపారు. ఇందులో ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించి రూ.1 కోటి 85లక్షలు అంచనా వేసి ఆమోదించి తీర్మానం చేసినట్లు ఇఒపిఆర్‌డి వీర భద్రుడు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ ఓబులేసు, సిబ్బంది, ఉపాధి హామీ మహిళలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటిని మాత్రమే పూర్తి చేయాలని మాజీ జడ్‌పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని హిమ కుంట్లలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నతా ఆశయంతో రైతులకు, ఇతర వర్గాల వారికి ఉపాధి హామీ పథకం ద్వారా గుర్తించే పనులు ఉపయోగకరంగా ఉండాలన్నారు. సింహాద్రిపురంలో జరిగిన గ్రామసభకు టిడిపి నాయకులు మా రెడ్డి జోగి రెడ్డి హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఉపాధి హామీ పథకం ఎపిఒ జయ భారతి, పంచాయతీరాజ్ ఎఇ ఉదయ్ కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : స్థానిక సమస్యల పరిష్కారమే గ్రామ సభ ముఖ్య ఉద్దేశం అని కమలాపురం పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయం దగ్గర సర్పంచ్ కంది మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు.ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన గ్రామ సభలకు ఈ ప్రభుత్వంలో జరిగే గ్రామ సభకు గల తేడాను ప్రజలు గమనించాలని కోరారు. గతంలో గ్రామాలలో అభివృద్ధి లేక ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని అన్నారు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా ప్రజలకు అందించాలని కృత నిశ్చయంతో ఉందని అన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయ్ కుమార్, ఇఇ ఆర్.రామచంద్రారెడ్డి, తహశీల్దార్ నాగేశ్వర రావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వి. శ్రీధర్, మండల టిడిపి యకులు టక్కోలి కృష్ణారెడ్డి, కంది మహేశ్వర్‌రెడ్డి, నజీర్, రాజా, పీరు ప్రసాద్, ధర్మా రెడ్డి, దస్తగిరి, మాధవరెడ్డి, సుభాన్ సాహెబ్ పాల్గొన్నారు.

చాపాడు : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజల అభీష్టం మేరకే పనులు గుర్తింపు చేపడుతున్నామని మండల అభివృద్ధి అధికారి శ్రీధర్ నాయుడు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా రాబోయే ఏడాదిలో చేపట్టబోయే పనులు గుర్తింపునకు శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అన్నవరం బద్రిపల్లి గ్రామాల్లో మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన పనులను వారి ఆధ్వర్యంలోనే గుర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గ్రావెల్ రోడ్లు, గోకులం షెడ్లు, పండ్ల తోటల పెంపకం వంటి వివిధ పనులను ప్రజల అభ్యర్థన మేరకు నమోదు చేసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్ రెడ్డి, ఉపాధి ఎపిఒ, జగదీశ్వర్ రెడ్డి, ఎపిఎం వెంకటరమణ, ఎఒ మ్యాగీ, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ వేణి, సర్పంచ్‌లు పీరయ్య, గుత్తి మల్లేశ్వరి, టిడిపి నాయకులు నాయబ్ రసూల్, జైనుల్లా, గుత్తి వీరనారాయణ యాదవ్, సుబ్బారెడ్డి,ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వేంపల్లె : అధికారులకు, సర్పంచ్‌కు వినతి పత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రొద్దుటూరు : గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని వెలుగు కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మైథిలి మాట్లాడుతూ మీ గ్రామంలో గ్రామ వీధులలో రోడ్లు అవసరం ఉన్నాయా, మురుగు కాలువలు అవసరం ఉన్నాయా, ఏమైనా ఉంటే గ్రామసభలో తెలియపరచాలన్నారు గోకులం షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఉపాధి హామీ పథకంలో ఏద్దైతే అభివృద్ధి పనులు అవసరం ఉన్నవో అవన్నీ గుర్తించి అభివృద్ధి చేస్తామన్నారు కార్యక్రమంలో నర్సాపురం సర్పంచ్ ఖాజావలి, ఉపాధి టిఎ అబ్దుల్, ఫీల్డ్ అసిస్టెంట్లు గురయ్యా పాల్గొన్నారు.

పెద్దముడియం : దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు అని గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పనులు చేయడమే ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ లక్ష్యం అని జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బారామి రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సుద్ధపల్లి గ్రామంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు నేతృత్వంలో గ్రామసభను ఏర్పాటు చేశారు. పల్లెలు పచ్చగా ఉంటేనే పట్టణాలు సైతం బాగుంటుందని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, పిఆర్ ఎఇ శ్రీనివాసులు, ఇసి శ్రీరాములు మండల అన్ని శాఖల సిబ్బంది, కూటమి కార్యకర్తలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : గ్రామసభలో పంచాయతీలోని సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా జరిగినటువంటి ఉపాధి హామీ గ్రామ సభలలో సోమిరెడ్డిపల్లి పంచాయతీలో జరిగినటువంటి గ్రామసభలో సునీల్ కుమార్ మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం 5 రోడ్ల కూడలిలో బస్‌షెల్టర్ ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఉపాధి హామీ పనులను విద్యాసంస్థలలో, ప్రభుత్వ వైద్యశాలలో, ప్రభుత్వ పార్కులలో, పేదల నివసించే వీధులలో చెట్లను తొలగించే పనులను పెట్టాలి అన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్ నుండి శ్మశానం వెళ్లే దారిలో ఇరువైపులా దారి మధ్యలో చెట్లను తొలగించాలి అన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద ఉన్న మురుగు కాలువను శుభ్రం చేయాలి. ఆస్పత్రి వద్ద రోడ్డుపై నిలుస్తున్న మురుగునీటిని తొలగించి మరమ్మతు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

గందరగోళంగా గ్రామసభ

ఎర్రగుంట్ల : మండలంలోని చిలమకూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభ గందరగోళంగా మారింది. గ్రామ సమస్యలు, వాటిని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించకపోవడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉపాధి పనులపై గ్రామ సభలో ప్రజలతో చర్చించి తీసుకోవాల్సిన నిర్ణయాలను పక్కదోవ పట్టించారని పలువురు ఆరోపించారు. పంచాయతీలో నీటి కులుషితం, సిసి రోడ్లు, రజకులకు దోబీఘాట్లు వంటి సమస్యలున్నా వాటిపై అధికారులు దృష్టి పెట్టలేదని పేర్కొన్నారు. దీంతో ప్రజలు గ్రామ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

వేముల : మండల కేంద్రంలోని గొల్లలగూడూరు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బీరం శ్రీకాంత్ రెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి గ్రామాలు పట్టుగొమ్మలాంటిమని అలాంటి గ్రామాల అభివృద్ధికి ప్రజల సహకారంతో గ్రామాలలో చేయాల్సిన అభివృద్ధి పనులను ప్రజల ద్వారా తెలుసుకొని ప్రభుత్వానికి పంపడం ద్వారా ఆయా పనులను ప్రజల సద్వినియోగం చేసుకునే వీలు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనమ్మ, పంచాయతీ సెక్రెటరీ సులోచన, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హసీనా, సచివాలయ అసిస్టెంట్ ఇంజినీర్ శశిధర్ రెడ్డి, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ రామంజినాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండాపురం: మండల కేంద్రమైన కొండాపురంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభ కొండాపురం సచివాలయం ఆవరణలో నిర్వహించారు. ఎంపిడిఒ నాగప్రసాద్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామపంచాయతీలో అత్యంత కీలకం ప్రజల భాగస్వామ్యంతో గ్రామం ప్రణాళికలు తయారుచేసి గ్రామ పంచాయతీల అభివృద్ధి చెందుతాయని అన్నారు. గ్రామపంచాయతీలో నమోదు చేసుకున్న ప్రతి కుటుంబానికీ ఒక సంవత్సరంలో నూరు రోజుల వేతనం ఉపాధి పథకం కల్పిస్తామని చెప్పారు. పనిచేసిన 15 రోజుల్లోపు వేతనాలు చెల్లిస్తామన్నారు. మండలంలోని సుగుమంచి పల్లె ఆర్ అండ్ ఆర్ పంచాయతీలో సర్పంచ్ ఎన్నికలు జరగకపోవడంతో వారికి రావాల్సిన గ్రామపంచాయతీ నిధులు రావడంలేదని ప్రజలు విన్నవించుకున్నారు కార్యక్రమంలో కొండాపురం మాజీ ప్రెసిడెంట్ విశ్వనాథ రెడ్డి, ఎంపిటిసి బాబు , క్లస్టర్ ఇన్‌ఛార్జి గోరిశెట్టి బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్ఐవి అంటువ్యాధి కాదు

ప్రజాశక్తి - చాపాడు

హెచ్ఐవి అంటువ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని డాక్టర్ ఓబులేష్ తెలిపారు. మండల పరిధిలోని కేతవరం గ్రామంలో చైల్డ్ ఫండ్ ఇండియా స్కీం ఆధ్వర్యంలో అవగాహన, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, అలాగే వ్యాధి వ్యాపించే మార్గాలను, నివారణలను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి సుమలత, పర్యవేక్షకులు రమేష్, పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమా మహేశ్వరి, చైల్డ్ ఫండ్ ఇండియా సిబ్బంది మహబూబ్ బాషా, దర్బార్ ,సురేంద్ర, ఎఎన్ఎం కీర్తి దాయని, ఆశా కార్యకర్తలు పద్మావతి, రూప పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - వల్లూరు

మొక్కల సంరక్షణ ప్రతి విద్యార్థీ బాధ్యత అని వల్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వల్లూరు ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లి పేరుతో ఒక చెట్టు కార్యక్రమంలో సుమారు 49 మంది విద్యార్థులు మొక్కలు నాటి వాటిని బాగా పెంచినందుకు శ్రీ విజయ దుర్గ ఏజెన్సీ సి.వెంకట్ రాజు వారికి వాటర్ బాటిల్ ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకట్ రాజు మాట్లాడుతూ విద్యార్థుల మొక్కల ఎంచడం వల్ల వాళ్లకు ప్రోత్సాహంగా ఉండాలని వాటర్ బాటిల్ ఉచితంగా అందించామన్నారు. చెట్ల సంరక్షణవల్ల మానవాళి మనుగడ మెరుగు పడుతుందన్నారు కార్యక్రమంలో స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఏకలవ్య ఫౌండేషన్ విద్యా వాహిని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎన్విత, వెంకట సుదర్శన్ , విద్యా వికాసం కో-ఆర్డినేటర్ వెన్నెల, ఉపాధ్యాయులు శ్యాంసుందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకం

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన ఎరువులతో పంటలు సాగు చేస్తే రైతుకు లాభదాయకమని మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని రాజులగురువాయపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పత్తి పంటను ఎఒ పరిశీలించారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి రాజుల రామసుధ తన పొలంలో నందిని పత్తి రకాన్ని సాగు చేసి సహజ పద్ధతులను అవలంభించారని చెప్పారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి,సేంద్రియ పద్ధతులు అనుసరించి పంట సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంట బెట్టకు గురి కాకుండా ద్రవ జీవామృతాన్ని పంట డ్రిప్, నీటి కాలువల, స్ప్రేయర్ల ద్వారా మొక్కలపై పిచికారి చేయాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. భూమి సారవంతమవుతుందన్నారు. పత్తి పంటలో శత్రు పురుగుల బారి నుండి పంటను కాపాడుకోవడానికి పక్షి స్థావరాలను ఎకరా పొలంలో 6 నుండి 7 చోట్ల ఏర్పాటు చేసుకోవాలన్నారు. రసం పీల్చే పురుగులు తెల్లదోమ ,ప చ్చ దోమ, త్రిప్స్, దీపపు పురుగులు, ఎపిడ్స్ లాంటివి అరికట్టేందుకు పొలంలో పచ్చ రంగు జిగురు అట్టలు, బ్లూ కలర్ జిగురు అట్టలను ఎకరానికి 8 చోట్ల పెట్టుకున్నట్లయితే రసం పీల్చే పురుగుల బారి నుండి పంటను కాపాడుకోవచ్చన్నారు. రైతులు సహజ పద్ధతులు పాటించి పంటలలో మెలకువలు పాటించి సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో భూపాల్ పాల్గొన్నారు.

అన్నారెడ్డి వివాహ వేడుకల్లో వైసిపి నాయకులు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పట్టణ పరిధిలోని ఎస్‌సిఎస్‌ఆర్ గార్డెన్స్ కల్యాణ మండపంలో శుక్రవారం అన్నా రెడ్డి వారి వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకు పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డి, పట్టణ వైసిపి కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, మార్కెట్ యాడ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, నూర్‌బాషా సంఘ అధ్యక్షులు ఓతురు రసూల్, వైసిపి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులు అన్నా రెడ్డి ప్రశాంత్ రెడ్డి రోహినీలను ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

వధూవరులతో మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్.మనోహర్‌రెడ్డి

క్రైం కార్నర్

ఆటో బోల్తా : ఒకరు మృతి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని రాయచోటి-వేంపల్లి మెయిన్‌రోడ్డు ఓబుల్ నాయనపల్లె సమీపంలో శుక్రవారం ఆటో బోల్తా పడిన ఘటనలో గంగారపు వాండ్లపల్లె గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి (66)మృతి చెందినట్లు చక్రాయపేట ఇన్‌ఛార్జి ఎస్ఐ రంగారావు తెలిపారు. కృష్ణారెడ్డి దినచర్యలో భాగంగా వేంపల్లికు కూరగాయలు తీసుకువెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఓబులు నాయన పల్లె వద్ద రోడ్డు గుంతల గుంతలుగా ఉండడంతో కంట్రోల్ చేయలేక అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలోని చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

రూ.21 వేలు నగదు స్వాధీనం

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని కొత్తపల్లె గ్రామ సమీపంలోని కంప చెట్లలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు శుక్రవారం సిఐ దస్తగిరి తెలిపారు. మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు, ఎర్రగుంట్ల మండలం సున్నపురాళ్లపల్లెకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ. 21వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - వేంపల్లె

తిరుపతి జిల్లా పాకాల గ్రామానికి చెందిన ముద్ద జవహర్ బాబుపై వరకట్న వేధింపు కేసు నమోదు చేసినట్లు సిఐ సురేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లి శ్రీరాంనగర్ వీధికి చెందిన మంచాల ప్రవల్లికతో ముద్ద జవహర్ బాబుకు రెండేళ్ల కిందట వివాహమైంది. కొద్ది రోజులు నుంచి భర్త జవహర్ బాబు, అత్త, బావ, ప్రవల్లికను రోజు మానసికంగా, శారీరకంగా హింస పెడుతూ అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టి జవహర్‌బాబు పై కేసు నమోదు చేసినట్లు సిఐతెలిపారు.